



మొరం.. అక్రమార్కులకు వరం

జిల్లాలో మొరం దందా అక్రమార్కులకు కాసుల వర్షాన్ని కురిపిస్తోంది. ప్రభుత్వ, పట్టా భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుపుతున్నారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ప్రభుత్వానికి పన్ను చెల్లించకుండా అడ్డగోలుగా మొరం తవ్వకాలు నిర్వహిస్తున్నారు. ఇలా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం సైతం గండి కొడుతున్నారు. ప్రైవేట్, ప్రభుత్వ భూములు అని తేడా లేకుండా మొరం తవ్వకాలు చేపడుతూ అక్రమార్కులు లక్షలు గడిస్తున్నారు. ఇటీవల బాన్సువాడ మండలంలో బుడిమి గ్రామ శివారుల్లో అక్రమ మొరం తవ్వకాలు జరపడంతో గుట్టలే మాయమయ్యాయి. ఇలా బాన్సువాడ డివిజన్ పరిధిలోనే కాకుండా జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి డివిజన్‌లోని పలు అటవీ ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల్లో అక్రమ మొరం తవ్వకాలు జోరుగానే సాగుతున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు మాత్రం పట్టింపులేకుండా పోతోంది.

- జిల్లాలోని పలుచోట్ల అక్రమంగా మొరం తవ్వకాలు
- ప్రభుత్వ పనుల పేరిట పక్కదారి
- ప్రభుత్వ, పట్టా భూముల్లో తవ్వకాలు చేపడుతున్న అక్రమార్కులు
- అక్రమంగా వెంచర్లకు మొరం తరలింపు
- ఒక్కో ట్రాక్టర్, టిప్పర్ మొరం రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పైగానే విక్రయం
- రాయల్టీని ఎగ్గొడుతున్న అక్రమార్కులు

కామారెడ్డి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అక్రమంగా మొరం తవ్వకాలు జరుగుతున్నాయి. ప్రధానంగా బాన్సువాడ, నస్రూల్లాబాద్, బీర్కూర్ మండలాల పరిధిలోని ప్రభుత్వ, పట్టా, అటవీ భూముల్లో ప్రకృతి సంపద చాలానే ఉంది. బాన్సువాడ మున్సిపాలిటీ కావడం, నస్రూల్లాబాద్ మండల కేంద్రంగా ఏర్పడడంతో స్థానికంగా వెంచర్‌లు వెలిశాయి. ఈ వెంచర్లకు అక్రమంగా మొరాన్ని తరలించేందుకు స్థానికంగా ఉండే కొందరు మొరం వ్యాపారులు, స్థానిక నేతలు, రెవెన్యూలోని అధికారులతో కుమ్మక్కై ఈ మండలాల పరిధిలోని ప్రభుత్వ, పట్టాభూముల్లో గల మొరం గుట్టలపై పడింది. ఇటీవల బాన్సువాడ మండలంలోని బుడిమిలో ప్రభుత్వ పనుల పేరిట మొరం తవ్వకాలు జరుపుతూ అక్రమంగా పక్కదారి పట్టిస్తూ ప్రైవేట్ పనులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. బాన్సువాడలోనే కాకుండా ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని తాడ్వాయి, గాంధారి, ఎల్లారెడ్డి మండలాల్లోనూ మొరం అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. కామారెడ్డి డివిజన్ పరిధి లోనూ రామారెడ్డి, మాచారెడ్డి, రాజంపేట మండ లా ల్లో మొరం అక్రమ తవ్వకాలు జరుపుతూ ప్రైవేట్ పనులకు తరలిస్తున్నారు. ప్రతీరోజు వందల టిప్పర్‌లలో మొరాన్ని తరలిస్తుండడంతో స్థానికంగా గుట్టలు కనుమరుగు అవడమే కాకుండా భారీ గుంతలు ఏర్పడ్డాయి. స్థానికంగా మొరం తవ్వకాలను బట్టి చూస్తుంటే బల్లారిలో తవ్వకాలు జరిపినట్లు దర్శనం ఇస్తున్నాయి. స్థానిక రెవెన్యూ, మైనింగ్ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా రోజుల తరబడి జేసీబీలు పెట్టి వందలాది టిప్పర్లలో మొరం తరలించారు. ప్రైవేట్ వెంచర్లకు, ఇతర భవన నిర్మాణాలకు వందలాది టిప్పర్‌లలో మొరం తరలిస్తు అక్రమార్కులు రూ.లక్షలో సొమ్ము చేసుకున్నారనే విమర్శలు వస్తున్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి

గ్రానైట్, కంకర క్వారీల మాదిరిగానే మొరం తవ్వకాలకు భూగర్భ గనుల, రెవెన్యూ శాఖల నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. ఇవి పర్యావారాణాన్ని దృష్టిలో ఉంచుకొని ఆయా శాఖల వారు తవ్వకాలు అనుమతి ఇస్తారు. ఒక్కో క్యూబిక్ మీటర్ మొరంకు రూ.30 రాయల్టీ చెల్లించాలి. అటవీ ప్రాంతాల్లో చెట్లను నరికివేస్తేనే కేసులు పెట్టే అటవీశాఖ అధికారులు ఆ చెట్లను కూడా ఆఖరికి భూములను తవ్వేస్తున్నా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ భూములు అయిన పట్టా భూములైన నిబంధనలకు లోబడే అనుమతులు పొందాలి. ప్రస్తుతం జిల్లాలో మొరం తవ్వకాలకు



బుడిమి గ్రామ శివారులో మొరం తవ్వకాలు చేపడుతున్న దృశ్యం

అనుమతులు లేవు. అయినప్పటికీ అక్రమంగా మొరం తవ్వకా లను చేపడుతున్నప్పటికీ సంబంధిత శాఖల అధికా రులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో ఎక్కడా తవ్వకాలు చేసినా హెక్టార్‌కు రూ.50వేలు గనుల శాఖకు, మరో రూ.50 వేలు తపాలా శాఖలో రిజిస్ట్రేషన్ కోసం చెల్లించాలి. విక్రయంపై అదనంగా 2.25 శాతం పన్ను చెల్లించాలి. ఇలా చెల్లించకపోవడంతో జిల్లాలో పలు ప్రాంతాల్లో చేపడుతున్న మొరం తవ్వకాలతో రూ.లక్షల్లో ప్రజాధనం అక్రమార్కుల పరమవుతోంది. బహిరంగ మార్కెట్‌లో ఒక్కో ట్రాక్టర్ మొరం రూ.2 వేల వరకు విక్రయిస్తుండగా ఒక్కో టిప్పర్ మొరం రూ.4 వేల వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వానికి పైసా చెల్లించకుండా ఆదాయానికి గండి కొడుతున్నారు.

అక్రమార్కులకు ప్రజాప్రతినిధులు, అధికారుల అండదండలు

జిల్లాలో రెవెన్యూ, మైనింగ్ శాఖలోని కొందరు అధికారులు, స్థానిక నేతల అండదండలతో మొరాన్ని అక్రమంగా తరలిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా బాన్సువాడ, ఎల్లారెడ్డి, గాంధారి, సదాశివనగర్, మద్నూర్, తాడ్వాయి, లింగంపేట్, పిట్లం, నస్రూల్లాబాద్ మండలాల్లో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు అండదండలతోనే అక్రమార్కులు గుట్టలను కరిగించేస్తున్నారు. జిల్లాలోని మండలాల్లో ప్రైవేట్, ప్రభుత్వ స్థలంలో గత కొన్ని రోజులుగా మొరం అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. ప్రతీరోజు పదుల సంఖ్యలోనే అక్రమంగా మొరం తరలిస్తున్నారు. గ్రామస్థులు ఎవరైనా అడ్డుకుంటే స్థానిక ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పి భయభ్రాంతులకు గురిచేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ రోడ్డు పనులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇరిగేషన్ పనులకు మొరం తవ్వకాలు జరుపుతున్నట్లు అక్రమార్కులు పేర్కొంటున్నారు. ఇలా జిల్లాలో అక్రమంగా మొరం తవ్వకాలు జరుగుతున్నా మైనింగ్‌శాఖ, రెవెన్యూ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.



నెమలిలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

లారీలు లేకుంటే ధాన్యాన్ని

ట్రాక్టర్లలో మిల్లులకు తరలించండి

- ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నసురుల్లాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైతులు తాము పండించిన వరి ధాన్యానికి గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం మండలంలోని దుర్కి, నెమలి గ్రామాలకు విచ్చేసి అధికారులు, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేమ వచ్చిన వడ్ల కుప్పలను త్వరితగతిన లారీలు అందుబాటులో లేకుంటే ట్రాక్టర్లలో మిల్లులకు పంపించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు చర్యలు చేపట్టి తేమ, తరుగు పేరిట రైతాంగానికి నష్టం కలుగకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



మద్నూర్ గురుకుల పాఠశాల విద్యార్థిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

జాతీయస్థాయి వాలీబాల్

పోటీలకు ఎంపికైన గురుకుల విద్యార్థి

మద్నూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు. గత నెల అక్టోబరులో సంగారెడ్డిలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 రాష్ట్రస్థాయి పోటీల్లో గురుకుల పాఠశాల విద్యార్థి సీహెచ్. నితీష్ ఇంటర్ రెండవ సంవత్సరం ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 11 నుంచి 15 వరకు ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ యూ/17 పోటీల్లో పాల్గొంటారని కామారెడ్డి జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ హీరాలాల్ ప్రకటించారని తెలిపారు. జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినిని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు గణేష్, నాగరాజు, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న దృశ్యం

ఘనంగా యోగా భవన్ వార్షికోత్సవం

కామారెడ్డి టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కామారెడ్డిలో ఏర్పాటు చేసిన యోగా భవన్ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగరాంరెడ్డి మాట్లాడుతూ యోగా భవన్ తెలంగాణ రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా నిర్మించడం జరిగిందన్నారు. ఇక్కడ ఉచితంగా యోగా క్లాసులు నిర్వహిస్తుండడం వల్ల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యోగా మన సనాతన ధర్మంలో భాగమని యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. పలువురు యోగాసనాలు వేసి అలరించారు. ఈ కార్యక్రమంలో గోవర్ధన్‌రెడ్డి, గరిపల్లి అంజయ్య, అనిల్‌రెడ్డి, రమేష్, ఎల్లయ్య, రాజ్‌కుమార్, భరత్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

శునకమా.. కరవకుమా!

- వేల్పూర్ మండలంలో కుక్కల బెడద
- తరచూ దాడులతో ప్రజల బెంబేలు
- బయటకు రావాలంటే జంకుతున్న జనం



6



ఉపాధ్యాయుల్లో..

టెట్ కలవరం

- ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు అర్హత సాధించాల్సిందే..
- ఉత్తీర్ణతకు రెండేళ్ల గడువు
- మార్గదర్శకాలు జారీ చేసిన ఎన్‌సీటీఈ
- 2010కి ముందు నియమితులైన వారిలో టెన్షన్

కామారెడ్డి టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి పలు మార్పులు చేశారు. విద్యార్హతలతో పాటు వృత్తి సామర్థ్యాలను మరింతగా పరీక్షించి నాణ్యమైన అభ్యర్థులను ఎంపిక చేయాలనే ఉద్దేశంతో ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)ను ప్రవేశపెట్టారు. అయితే సెప్టెంబరు 1న ప్రభుత్వ పాఠశాలల్లో బోధించే ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి అని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు, తాజాగా నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్(ఎన్‌సీటీఈ) విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం టెట్ అర్హత తప్పనిసరి కానుండడంతో ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొంటుంది. విధుల్లో కొనసాగాలన్నా... పదోన్నతి పొందాలన్నా టెట్ ఉత్తీర్ణతకు రెండేళ్ల గడువు విధించడం ఆందోళనకు గురిచేస్తోంది. 2012 డీఎస్సీ ద్వారా ఎంపికైన వారు టెట్ అర్హత కలిగి ఉన్నారు. అంతకముందు బీఈడీతో పరీక్షలు రాసి ఉద్యోగం చేరిన వారికి టెట్ లేకపోవడం అయోమయంలో పడేసింది. ఉద్యోగ విరమణకు దగ్గరున్న పదోన్నతుల పొందాలనుకునే టీచర్లను నిరాశ గురి చేస్తోంది. అయితే సుప్రీంకోర్టు తీర్పు, ఎన్‌సీటీఈ మార్గదర్శకాల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వలేదని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి. తమిళనాడు, కేరళ లాంటి రాష్ట్రాల్లో మాదిరి తెలంగాణ ప్రభుత్వం టెట్‌పై సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్ వేయాలని కోరుతున్నాయి.

రెండేళ్లలో టెట్ అర్హత సాధించాలి

విద్యాహక్కు చట్టం ప్రకారం 2010 నుంచి టెట్(టీచర్ ఎలిజిబులిటి టెస్ట్) అమలులోకి వచ్చింది. ఎస్‌జీటీలు అయితే టెట్ పేపర్-1, స్కూల్ అసిస్టెంట్‌లు అయితే పేపర్-2 రాయాలి. 2010 కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయులందరూ టెట్ అర్హత పరీక్ష రాయాల్సి ఉంటుంది. 2030 సెప్టెంబరు 30లోపు ఉద్యోగ విరమణ చేసేవారు రాయనవసరం లేదు. అయితే ఐదేళ్లలో ప్రమోషన్ పొందాలంటే టెట్ తప్పనిసరి. ఐదేళ్లకుపైగా (మిగతా 8లో..)

బీర్కూర్‌లో భారీ వర్షం

- తడిసిన వరి ధాన్యం

బీర్కూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. 20 నిమిషాల పాటు ఏకధాటిగా వర్షం కురియడంతో వరి ధాన్యం తడిసి ముద్దయ్యింది. బీర్కూర్ మండలంలోనీ దామరంచ, రైతునగర్, అన్నారం, చించొల్లి, వీరాపూర్, కిస్టాపూర్, బీర్కూర్, సంబా పూర్, బరంగ్ ఏడ్గీ, భైరాపూర్, మల్లాపూర్, తిమ్మాపూర్, బీర్కూర్ తండాలో భారీ వర్షం కురిసింది. వర్షం ధాటికి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో, మార్కెట్ యార్డులో, పొలాల్లో, రోడ్లపై రైతులు ఆరబోసుకున్న వరి ధాన్యం వర్షానికి తడిసి ముద్దయ్యింది. దీంతో పాటు వరదల ధాటికి ధాన్యం కొట్టుకుపోయింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని రైతులు తిరిగి ఆరబెట్టుకుంటున్నారు.



బీర్కూర్‌లో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

ఉన్నత విద్యకు మళ్లీ బ్రేక్

- విద్యార్థులకు అందని స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్
- నాలుగేళ్లుగా విడుదల కాని బడ్జెట్
- జిల్లాలో రూ.70 కోట్లకు పైగా బకాయిలు
- ఇబ్బందులు పడుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు
- కోర్సులు పూర్తి చేసిన విద్యార్థుల నుంచి ఫీజు వసూళ్లు
- ఆందోళనకు దిగుతున్న ప్రైవేట్ కళాశాలలు, విద్యార్థి సంఘాలు
- నేటి నుంచి ఉన్నత కళాశాలలు నిరవధిక బంద్

కామారెడ్డి టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గత నాలుగేళ్లుగా ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత విద్యా సంవత్సరం ముగిసి ఇతర కోర్సుల్లో ప్రవేశించేందుకు సర్టిఫికెట్లకు కొన్ని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులు పెడుతుండడంతో గత్యంతరం లేక అప్పులు తెచ్చి మరి ఫీజులు చెల్లించి విద్యార్థులు సర్టిఫికెట్లను తీసుకెళ్తున్నారు. మరికొన్ని యాజమాన్యాలు మాత్రం మానవత్వం చూపి విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించి సర్కార్ అందించే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కోసం ఎదురు చూస్తున్నారు. ఇటీవల ప్రైవేట్ యాజమాన్యాలతో చర్చలు జరిపిన ప్రభుత్వం విడతల వారీగా కొద్ది మొత్తంలోనే నిధులను విడుదల చేసింది. అయితే జిల్లాలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు సంబంధించి దాదాపు రూ.70 కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల విడుదల చేసిన నిధుల్లో జిల్లాకు రూ.2కోట్ల వరకు మాత్రమే నిధులు కేటాయించారని విద్యార్థి సంఘ నాయకులు, కళాశాల యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. నాలుగేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో ఇటు విద్యార్థులు అటు కళాశాల యాజమాన్యాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైగా విజిలెన్స్ దాడులు అంటూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైంది కాదని తమ న్యాయమైన డిమాండ్లను అడిగితే భయపెట్టే ధోరణి చేస్తుండడంతో నేటి నుంచి కళాశాల యాజమాన్యాలు బంద్ ప్రకటిస్తూ నిర్ణయం తీసుకున్నాయి.



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

నాలుగేళ్లుగా నిరీక్షణ

జిల్లాలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై సుమారు 10 నుంచి 15 వేల మంది విద్యార్థులు ఆధారపడి ఉన్నత చదువులు చదువుతున్నారు. నాలుగేళ్ల నుంచి గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఫీజులను చెల్లించకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి ప్రాంతాల్లోని ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, బీఈడీ ఇతర వృత్తిపరమైన కళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాలలకు సుమారు రూ.70 కోట్ల వరకు బకాయిలు రావాల్సి ఉంది. గత ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో ఎన్నికల్లో గెలిచేందుకు (మిగతా 8లో..)

క్రైం సమాచారం

ద్విచక్ర వాహనాల దొంగలకు రిమాండ్

బోధన్,నవంబరు2(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు దొంగతనం చేస్తూ వాటిని మహారాష్ట్రలో విక్రయిస్తున్న ఇద్దరు దొంగలను ఆదివారం బోధన్ పట్టణ ఎస్‌ఐలు హబీబ్ ఖాన్, మనోజ్ పట్టుకున్నట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం మధ్యాహ్నం అంబేద్కర్ చౌరస్తా వద్ద వాహన తనిఖీ నిర్వహిస్తుండగా ఇద్దరు పోలీసులను చూసి పారిపోతుండగా పట్టణ ఎస్‌ఐలు హబీబ్ ఖాన్, మనోజ్‌లు వారిని వెంబడించి పట్టుకున్నారన్నారు. వారిని విచారించగా సయ్యద్ మహ్మద్ జావెద్, సయ్యద్ ఇక్బాల్ అనే వారు బోధన్, ఆర్మూర్ పట్టణాల్లో బైక్‌లను దొంగతనం చేస్తూ, వాటి నెంబర్ ప్లేట్లను తొలగించి డూప్లికేట్ ఆర్సీలను తయారు చేసి మహారాష్ట్రలో అమ్ముతున్నారని తెలిపారు. వారి నుంచి రెండు బైక్‌లు, డూప్లికేట్ ఆర్‌సీ కార్డులను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని సీఐ వెల్లడించారు.

సూపర్‌మార్కెట్ షెట్టర్ ధ్వంసం


ధ్వంసం చేసేందుకు తీసుకొచ్చిన గ్యాస్‌కట్టర్

రెంజల్,నవంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాటాపూర్ గ్రామ శివారులో గల ఎంఎస్‌ఆర్ సూపర్ మార్కెట్ షెట్టర్‌ను కొంతమంది దుండగులు గ్యాస్ కట్టర్‌ను ఉపయోగించి ధ్వంసం చేసే ప్రయత్నం చేశారు. సుమారు ఉదయం 3గంటల ప్రాంతంలో సూపర్ మార్కెట్ షెట్టర్‌ను ధ్వంసం చేసే ప్రయత్నం చేయగా.. గ్యాస్ కట్టర్‌తో ధ్వంసం చేసే సౌండ్ రావడంతో సూపర్ మార్కెట్ యాజమాని హాజీభాష లోపల ఉండడంతో శబ్దాన్ని గమనించారు. లోపలి నుంచి ఎవరు అని అడుగగా షెట్టర్‌ను ధ్వంసం చేసేందుకు ఉపయోగించిన గ్యాస్ కట్టర్, ఆక్సిజన్ సిలిండర్‌ను వదిలేసి పారిపోయారు. సూపర్ మార్కెట్ యాజమాని హాజీభాష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు.

దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు

సుభాష్‌నగర్, నవంబరు 2, (ఆంధ్రజ్యోతి): దొంగతనం జరిగిన 48 గంటల్లోనే కేసును ఛేదించి ఇద్దరి దొంగలను 1వ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. అక్టోబరు 31న నగరంలోని ఎరుకల వాడలోని ఒక ఇంటిలోకి వెళ్లి బీరువా పగలగొట్టి బంగారు ఆభరణాలు, రూ.1500 నగదును ఎత్తుకెళ్లిన పాత నేరస్థులు మీర్జా అతర్ బైగ్, షేక్ అంజాద్‌ను 1వ టౌన్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఆదివారం గంజ్ మార్కెట్‌లో నగలను అమ్ముదామని అటు ఇటు తిరుగుతుండగా అనుమానం వచ్చిన పోలీసులు వారిని పట్టుకుని వారి నుంచి బంగారు ముక్కు పుడక, ఉంగరం, వెండి కడియాలు, మొబైల్ ఫోన్, 1500 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా ఇటీవల ఎరుకల వాడలో ఈ సొత్తును దొంగిలించామని అంగీకరించారు. వీరిపై ఇదివరకే దొంగతనాలు, హత్యాయత్నం కేసులు ఉన్నాయి. వీరిలో అత్తర్‌బైగ్ నెలన్నర క్రితమే జైలు నుంచి విడుదల అయ్యాడని సీఐ రఘుపతి తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో ముఖ్యపాత్ర పోషించిన ఎస్‌ఐ మహేష్, ఏఎస్‌ఐ షకీల్, కానిస్టేబుల్స్ గంగారాంలను ఏసీపీ రాజవెంకటరెడ్డి అభినందించారు.


ఆర్థికసాయం అందజేస్తున్న ఆటో యూనియన్ నాయకులు

డాన్స్ మాస్టర్ కుటుంబానికి చేయూత

వేల్పూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన డ్యాన్స్ మాస్టర్ అశోక్ (అబ్బాస్) కుటుంబానికి పలువురు ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. 2004-05 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా రూ. 20వేలు, వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన ఆటో యూనియన్ ఆధ్వర్యంలో రూ. 8వేలు మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ, వేల్పూర్ ఆటోయూనియన్ సభ్యులు మాట్లాడారు. డ్యాన్స్ మాస్టర్ అశోక్ అకాల మరణం పట్ల సంతాపం, సానుభూతిని తెలియజేస్తూ ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు నవీన్, బాలు, శీను, సురేష్, వెంకటేష్, వెంకట్‌రెడ్డి, మహిపాల్, ఆటో యూనియన్ నేతలు పాల్గొన్నారు.

మొగులు.. అన్నదాత గుబులు

ఏర్గట్ల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో సాగు చేసిన వరి పంటలు కోతకు వచ్చాయి. పంట పొలాలు ఆరిన రైతులు వారం రోజుల నుంచి కోతలు మొదలుపెట్టారు. మండలంలోని నిత్యం ఏదో ఒక గ్రామంలో రోజూ వాన పడటంతో మబ్బులు కమ్ముకోగానే.. అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 5,500 ఎకరాల్లో వరి సాగు చేయగా.. ఎండ ప్రభావం లేకపోవడంతో కోతకు వచ్చిన వరి పొలాలు ఆరడం లేదు. దీంతో పంట చేతికి వస్తుందో లేదోనని రైతులు భయపడుతున్నారు. వానలకు వరి కోతమిషన్లు బురదలో దిగిపోతుండటంతో పంటలు ఎలా కోసుకోవాలని చింతిస్తున్నారు. పంట చేతికి వచ్చే సమాయానికి మొన్న కురిసిన భారీ వర్షాలకు పెద్ద ఎత్తున పొలాలు నేలకొరిగాయి. రెండు రోజులగా మేఘాలు కమ్మేయడంతో రైతులు దిగులు చెందుతున్నారు. లక్షలు ఖర్చు చేసి సాగు చేసుకున్న పంటలు చేతికి వస్తాయో లేదోనని భయంగా ఉందని తాళ్ల రాంపూర్‌కు చెందిన రైతు బోనగిరి రమేష్ వాపోయారు.

శునకమా.. కరవకుమా..!

▸▸ వేల్పూర్ మండలంలో కుక్కల బెడద ▸▸ తరచూ దాడులతో ప్రజల బెంబేలు ▸▸ బయటకు రావాలంటే జంకుతున్న జనం

వేల్పూర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండల గ్రామాలలో కుక్కల బెడద పెరిగిపోతున్న పట్టించుకునే వారే కరువయ్యారని ప్రజలు వాపోతున్నారు. ఒక్కొక్క గ్రామంలో సుమారు 35 నుంచి 50 వరకు వీధి కుక్కలు ఉన్నాయని పలు గ్రామాల ప్రజలు తెలిపారు. గ్రామంలోని అన్ని వీధులలో కుక్కలు ప్రతీ రోజు స్వైర విహారం చేస్తుండడంతో ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. వీధి రోడ్లపై గుంపులుగా కుక్కలు తిరుగుతూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నప్పటికి గ్రామస్థాయి అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించాలని కోరుతున్నారు.


వేల్పూర్‌లో ప్రధాన కూడలి వద్ద కుక్కలు స్వైర విహారం చేస్తున్న దృశ్యం

ఇటీవల పలు గ్రామాల్లో దాడులు..

గ్రామంలో రోడ్లపై వీధి కుక్కలు తిరుగడం వల్ల ఇంటి నుంచి బయటకు రావాలంటే భయంగా ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల జాన్కంపేట్, అమీనాపూర్, వేల్పూర్, అక్లూర్, పోచంపల్లి గ్రామాలతో పాటు ఇతర గ్రామాల్లో కుక్కలు పలువురిపై దాడి చేసి గాయపర్చాయి. గ్రామాలలో రోజురోజుకు కుక్కల సంఖ్య పెరిగిపోతూ దాడులు చేస్తున్న కుక్కల నియంత్రణ కోసం అధికారులు పట్టించుకున్న పాపన పోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.

రాత్రయితే చాలు ఒకచోట చేరి..

రాత్రి అయితే చాలు గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద చేరి వచ్చిపోయే వారి మీదకి దూసుకెళ్తున్నాయని పేర్కొంటున్నారు. ఒంటరిగా వెళ్తే ప్రమాణాలకే ముప్పు జరిగే అవకాశం ఉందన్నారు. అధికారులు కుక్కల బెడద నివారించి, తమను కాపాడాలని కోరుతున్నారు.


బీఆర్‌ఎస్ నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సునీల్‌రెడ్డి

కాంగ్రెస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి

భీమ్‌గల్ రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని, అందుకే ఇతర పార్టీల నుంచి చేరికలు పెరుగుతున్నాయని కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని బడా భీమ్‌గల్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. సునీల్ కుమార్ వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా నియమితులైన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని కాంగ్రెస్ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బడా భీమ్‌గల్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు రాగుల మోహన్, పిట్ల శ్రీనివాస్, ధాకటి స్వామి, సతీష్, శ్రీధర్ గౌడ్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


రక్షణ గోడలు లేకుండా ప్రమాదకరంగా ఉన్న వంతెన

వంతెనకు రక్షణగోడలు నిర్మించాలి

ఆర్మూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలంలోని గోవింద్‌పేట్, జాన్కంపేట్ గ్రామాల మధ్య ఆర్‌అండ్‌డీ రోడ్డుపై గతంలో నిర్మించిన వంతెనకు ఇరువైపులా రక్షణగోడలు ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. ఈ రహదారి గుండా నిత్యం భీమ్‌గల్, బడా భీమ్‌గల్, చేంగల్, పచ్చలనడ్కుడ, జాన్కంపేట్ గ్రామాల పరిధిలో జక్రాన్‌పల్లి మండలం కొలిప్యాక్, కలిగోట్ తదితర గ్రామాలకు వందలాది వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. బ్రిడ్జి వద్ద గతంలో పలు ప్రమాదాలు జరిగాయి. బ్రిడ్జికి నిర్మించిన పైపులు ధ్వంసం కావడంతో పాటు వాటిని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. అప్పటి నుంచి వంతెనకు ఇరువైపులా సైడ్‌వాల్స్ లేక ప్రమాదకరంగా తయారైంది. రాత్రి సమయాల్లో అజాగ్రత్తగా ఉంటే బ్రిడ్జిపై నుంచి కిందికి పడిపోయే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి బ్రిడ్జికి ఇరు వైపులా సైడ్‌వాల్స్ నిర్మించి ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ మండల నాయకులు

రోడ్డు పనులు షురూ

డొంకేశ్వర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం గ్రామంలో రూ.10 లక్షల సీఆర్‌ఆర్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూమేష్‌రెడ్డి ప్రారంభించారు. కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌కుమార్‌రెడ్డి నిధులు మంజూరు చేయించారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు గణేష్ గౌడ్, నాయకులు సుద్ద చిన్నయ్య, రాజు, మున్నా తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి ఉత్సవాలు

ఆర్మూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పరిధిలోని పెర్కిట్‌లో శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఈ నెల 5వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 5న ఉదయం శివ పంచాయతన ఆలయం నుంచి విగ్రహాల ఊరేగింపు, గణపతి పూజ, పుణ్యాహవచనం, గణపతి హోమం, 6న గణపతి పూజ, మూల మంత్ర హవనం, సామూహిక కుంకుమార్చన, 7న యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠాపన, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. పెర్కిట్, ఆర్మూర్ పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో హాజరై, స్వామివారి ఆశీస్సులు అందుకోవాలని కోరారు.

శ్రమదానం.. పాఠశాల పరిశుభ్రం


శ్రమదానం చేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

ఆర్మూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెర్కిట్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఆదివారం ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో, క్రీడా మైదానంలో పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలను తొలగించి, శుభ్రం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి విద్యార్థినులకు అసౌకర్యంగా మారింది. స్వచ్ఛంద సంస్థ సభ్యులకు సహకారం అందించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, సభ్యులు ప్రశాంత్, రాజ్‌కుమార్, సుంకె నిశాంత్, సుమన్, ఆదిత్య, నరేందర్, వేణు, గణేష్, పాఠశాల సిబ్బంది శ్యామ్, ప్రేమ్, విద్యార్థినులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


మహిళకు కుట్టు మిషన్ అందజేస్తున్న దృశ్యం

బోధన్,నవంబరు2(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాలలో రాణించాలని లయన్స్ డిస్ట్రిక్ 320 డీ గవర్నర్ అమర్‌నాథ్ రావు అన్నారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు సమాజ సేవలో ముందుండి సమాజానికి ఉపయోగపడేటట్లుగా సేవలు చేయాలని సూచించారు. ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి ఆధ్వర్యంలో సేవ కార్యక్రమాల్లో భాగంగా నిరుపేద మహిళలకు కుట్టు మిషన్‌లను అందజేశారు. లయన్స్ క్లబ్ కొత్త సభ్యులుగా చేరిన ఎస్. బలరామ రాజు, దామోదర్‌లను గవర్నర్ లయన్స్ ఐ హాస్పిటల్‌లో పిన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ రామకృష్ణ, లయన్స్ ప్రతినిధులు గోపాల్ రావు, కే.రాజాబాబు, నరసింహ రాజు, పద్మావతి, రాం మనోహర్, సౌభాగ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం

ఎడపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎడపల్లిలోని కొత్తబస్టాండు వద్ద ఆదివారం మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాంచందర్ మాట్లాడుతూ.. దేశ సైనికుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి వైఖరిని ఖండిస్తూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు రాజు, బీజేవైఎం మండల అధ్యక్షుడు సాయికుమార్, బూత్ అధ్యక్షుడు ప్రదీప్ కుమార్, నాయకులు సుధాకర్, లక్ష్మణ్, గంగాధర్, రాకేష్ పాల్గొన్నారు.

కోటగిరి, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్‌పై సీఎం రేవంత్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై పొతంగల్ బీజేపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ధర్నా నిర్వహించారు. త్రివిధ దళాలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు హన్మాండ్లు, ఓమన్న పటేల్, దిగంబర్ పటేల్, లక్ష్మణ్, శంకర్, విజయ్, సాయికృష్ణ పాల్గొన్నారు.


ఎడపల్లిలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు


పొతంగల్‌లో ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

వెంకన్న ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

ఆర్మూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మునిసిపల్ పరిధి పెర్కిట్‌లో శ్రీ వెంకటేశ్వర మందిర పునర్నిర్మాణానికి శ్రీ గణేష్ యూత్ పెర్కిట్ ఆధ్వర్యంలో రూ.28,116 నగదును విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ నిర్మాణంలో భాగంగా తమవంతు సహకారం అందించిన యూత్ సభ్యులకు ఆలయ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.


విరాళాన్ని అందజేస్తున్న గణేష్ యూత్ సభ్యులు


జాడిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, రైతులు


కోటగిరిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

సాలూర,నవంబరు2(ఆంధ్రజ్యోతి): రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు క్వింటాలుకు 500రూపాయల బోనస్ ఇచ్చిన సందర్భంగా ఆదివారం సాలూర మండలం జాడి జమాల్‌పూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు, రైతులు సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, ప్రభుత్వ సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా రైతుల పక్షాన ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామ రైతులు చిలకబాబు, శ్రీనివాస రావు, సూరిబాబు, నాగేష్, నానిబాబు, రాములు, ఆంజనేయులు, రామకృష్ణ, కరామత్, మజార్, రవి, రాజు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కోటగిరి,నవంబరు2(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఖరీఫ్‌లో రైతులకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ అందించడం పట్ల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కోటగిరి మండలంలో సుమారు 200మంది రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ అయ్యాయని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మన్ హన్మంతు, విండో అధ్యక్షుడు సిద్దు, నాయకులు మనోహర్, షాహీద్, గంగాధర్ దేశాయ్, రాజయ్య, ఆనంద్ పాల్గొన్నారు.

ఎస్‌ఐను అభినందించిన సీపీ సాయిచైతన్య

సుభాష్‌నగర్, నవంబర్ 2, (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలనే అంశంపై షార్ట్ ఫిల్మ్ తీసిన ఏర్గట్ల ఎస్‌ఐ రాజేశ్వర్‌ను నిజామాబాద్ నగర పోలీసు కమిషనర్ సాయిచైతన్య అభినందించారు. ఈ షార్ట్‌ఫిల్మ్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుత రోజుల్లో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని కోరారు. అలాగే వాహనానికి సంబంధించిన అన్నిరకాల వాహన పత్రాలు, లైసెన్సు కలిగి ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కోరారు. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సుదర్శన్ రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

బోధన్, సాలూర, జక్రాన్‌పల్లి, రెంజల్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన సలహాదారులుగా నియమితులైన సందర్భంగా ఆదివారం సాలూర మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. నాయకులు శంకర్, స్వామి గౌడ్, సాలూర ఎత్తిపోతల పథకం చైర్మన్ శివకాంత్ పటేల్, గంగారాం ఉన్నారు.

● ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని జక్రాన్‌పల్లి మండల కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయన్ను కలిసి శాలువాతో సత్కరించారు. ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ సాయిరెడ్డి, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ పెద్దరాజన్న, మునిపల్లి మాజీ సర్పంచ్ చిన్నసాయిరెడ్డి పాల్గొన్నారు.

● ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని ఆదివారం బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ కౌన్సిలర్లు శరత్ రెడ్డి, ప్రభాకర్, సత్యం, శ్రీకాంత్ గౌడ్, శివాలయం కమిటీ చైర్మన్ హరికాంత్ చారి, మారుతి మందిరం కమిటీ చైర్మన్ శంకర్, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

● ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని రెంజల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మొబిన్ ఖాన్ ఆధ్వర్యంలో నాయకులు హైదరాబాద్‌లో ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు గయాస్, జావీదొద్దీన్, గంగాకిషన్, ధనుంజయ్, రవి, సురేందర్ గౌడ్, అసద్, రవీంద్ర బాబు, కృష్ణయ్య, మోహన్ తదితరులున్నారు.


సుదర్శన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న సాలూర నాయకులు


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న బోధన్ నియోజకవర్గ నాయకులు


సుదర్శన్ రెడ్డిని సన్మానిస్తున్న రెంజల్ మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్

జూబ్లీహిల్స్ ప్రచారంలో బిజీబిజీ


ప్రచారం చేస్తున్న జక్రాన్‌పల్లి మండల కాంగ్రెస్ నాయకులు


అన్వేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పాల్గొన్న జాన్కంపేట్ కాంగ్రెస్ నాయకులు

జక్రాన్‌పల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం కోసం ఆదివారం ఎర్రగడ్డ డివిజన్‌లోని మోతినగర్ కాలనీలో జక్రాన్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారం చేశారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డితో కలిసి జక్రాన్‌పల్లి మండల నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీ ఐడీసీఎంఎస్ చైర్మన్ ఎం. సాయిరెడ్డి, పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ పెద్ద రాజన్న, మునిపల్లి మాజీ సర్పంచ్‌లు చిన్నసాయిరెడ్డి, పాల్గొన్నారు.

వేల్పూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఈ నెల 11న జరగనున్న ఎమ్మెల్యే ఉపఎన్నికల ప్రచారంలో వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఆదివారం పాల్గొన్నారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి ఆధ్వర్యంలో జాన్కంపేట్ కాంగ్రెస్ నాయకులు జేమ్స్ గంగారెడ్డి, జీజీ రెడ్డి, సౌడ శ్రీనివాస్, జైరాజ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.


పాదయాత్రగా బయల్దేరుతున్న స్వాములు

కోటగిరి నుంచి శబరిమలైకి పాదయాత్ర

కోటగిరి,నవంబరు2(ఆంధ్రజ్యోతి): కోటగిరి ఉమ్మడి మండలం నుంచి పలువురు అయ్యప్ప స్వాములు ఆదివారం శబరిమలైకి పాదయాత్రగా తరలివెళ్లారు. కోటగిరి నుంచి నలుగురు స్వాములు, పొతంగల్ నుంచి ఆరుగురు కోటగిరి మండలకేంద్రంలో ఉన్న అయ్యప్ప ఆలయం నుంచి బాన్సువాడ మీదుగా శబరిమలైకు పాదయాత్రగా పయనమయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 48రోజుల పాటు ప్రయాణించి అయ్యప్ప సన్నిధికి స్వాములు చేరుకోనున్నారు.

బాసరలో సండే సందడి

బాసర, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బాసర సరస్వతీ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక మాసం ఆదివారం సాధారణ సెలవుదినం కావడంతో అమ్మవారి క్షేత్రానికి తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాల నుంచి కాకుండా పొరుగున మహారాష్ట్ర నుండి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. గోదావరి నదిలో కార్తీక స్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. నదీతీరంలో గల శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయంలో గల రెండు మండపాల్లో 554 మంది చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు జరిపించుకున్నారు.


అక్షర శ్రీకార పూజలు జరిపిస్తున్న భక్తులు



క్యూలైన్లలో భక్తులు

ధాన్యం.. దయనీయం

- వరుస వర్షాలతో అన్నదాత కుదేలు
- తడిసి ముద్దవుతున్న ధాన్యం
- బోరున విలపిస్తున్నరైతన్నలు

బాన్సువాడ టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈ యేడాది వర్షాలు సమృద్ధిగా కురిసాయి. పంటలు బాగా పండించి ఆర్థిక అభివృద్ధి చెందాలన్న అన్నదాత ఆశలు ఆవిరైపోయాయి. నెలల తరబడి కష్టబడి ధాన్యం కోతలు చేపట్టి ఆరబెడితే అకాల వర్షాలు వరిధాన్యంను కాస్త తడిసి ముద్ద చేస్తున్నాయి. ఉదయం ఎండగా ఉందని గంపెడు ఆశతో రైతన్నలు రోడ్లపై, కల్లాలపై వరిధాన్యం ఆరబెడి తే వర్షం మాత్రం అదును చూసి అన్నదాతను దెబ్బ మీద దెబ్బ కొడుతోంది. వర్షంలో తడిసిని ధాన్యాన్ని కుప్పలుగా చేస్తూ కన్నీరు మున్నీరవుతున్నారు. దిక్కులేని వాడికి దేవుడే దిక్కంటారు, మరి ఆ దేవుడే రైతన్నలపై ప్రతాపం చూపిస్తే దిక్కుతోచని స్థితిలో మగ్గిపోతున్నాడు. ఒక్కోసారి వ్యవసాయం దండగ అనే నిరాశకు లోనవుతున్నారు. ప్రభుత్వం ఇలాంటి విపత్తులు వచ్చినపుడు అన్నదాతలకు పంట ఇన్సూరెన్స్ చేయించితే రైతన్నలకు నష్టపరిహారం అంది కొంత ఉపశమనం కలిగించవచ్చు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకుంటున్నారు.


బాన్సువాడ మార్కెట్ కమిటీలో వర్షంలో కొట్టుకుపోయిన వరి ధాన్యం

ఎమ్మెల్యే హరీశ్‌రావును పరామర్శించిన డీసీసీబీ మాజీ చైర్మెన్

బాన్సువాడ టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును నిజామాబాద్ మాజీ డీసీసీబీ చైర్మెన్ పోచారం భాస్కర్‌రెడ్డి శనివారం రాత్రి పరామర్శించారు. హరీష్‌రావు తండ్రి తన్నీరు సత్యనారాయణరావు అనారోగ్యం కారణంగా మృతి చెందడంతో ఆయన నివాసానికి వెళ్లి పుష్పాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.


హరీశ్‌రావును పరామర్శిస్తున్న పోచారం భాస్కర్‌రెడ్డి

పరామర్శ

వర్ని, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి హరీష్ రావును ఆదివారం వర్ని మండల బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌లో కలిశారు. హరీష్ రావు తండ్రి ఇటీవల మరణించడంతో మండల నాయకులు యలమంచిలి శ్రీనివాస్ రావు, గంగప్ప తదితరులు హరీష్ రావును కలిసి సానుభూతి తెలిపారు. హరీష్ రావు తండ్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.


హరీష్‌రావును పరామర్శిస్తున్న దృశ్యం

అయ్యప్ప ఆలయంలో భక్తుల మాలధారణ


మాలధారణ స్వీకరించిన అయ్యప్ప భక్తులు

ఏర్గట్ల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏర్గట్ల మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం పలువురు అయ్యప్ప భక్తులు మాలధారణ స్వీకరించారు. మండలంలోని దోంచంద గ్రామానికి చెందిన పదిహేను మంది భక్తులు సౌడాల వినోద్ గురుస్వామి ఆధ్వర్యంలో మాలధారణ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు ఆలయ అర్చకులు రాకేష్ పాల్గొన్నారు.

కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నసురుల్లాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండలం మైలారం గ్రామ శివారులో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం కొచ్చెరి మైసమ్మ తల్లి అని అన్నారు. అనంతరం భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సహపంక్తి భోజనాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు..


కొచ్చేరి మైసమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అయ్యప్ప ఆలయానికి రూ.11వేల విరాళం


ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న దృశ్యం

బాన్సువాడటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి నసురుల్లాబాద్ గ్రామానికి చెందిన టేకుర్ల శ్రీకాంత్ తన తల్లి జ్ఞాపకార్థం 11,116 రూపాయల విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని ఆదివారం వ్యవస్థాపక గురుస్వామి బెజుగం శంకర్‌కు అందజేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు అర్షపల్లి సాయిరెడ్డి, విఠల్‌రెడ్డి, శంకర్‌గౌడ్ తదితరులున్నారు.

బీజేపీ నాయకుల రాస్తారోకో

బాన్సువాడ టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దేశ గౌరవం, సైనికుల మనోభావాలు దెబ్బతీసే విధంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి మాటలను తీవ్రంగా ఖండిస్తూ ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీజేపీ నాయకులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కోనాల గంగారెడ్డి మాట్లాడుతూ ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆపరేషన్ సింధూర్, దేశ సైనికులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటన్నారు. దేశం గురించి, సైనికుల గురించి వ్యతిరేకంగా మాట్లాడితే చూస్తు ఊరుకోమని హెచ్చరించారు. దేశ ప్రజలకు, సైనికులకు వెంటనే సీఎం క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశాడు. అనంతరం సీఎం దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చీదరి సాయిలు, కార్యదర్శి శంకర్ గౌడ్, నాయకులు లక్ష్మీనారాయణ, గుడుగుట్ల శ్రీనివాస్, చిరంజీవి, మహేశ్, చీకట్ల రాజు, గంగారాం, భాస్కర్‌రెడ్డి, నాగరాజ్ ఉన్నారు.


బాన్సువాడలో రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

నాగిరెడ్డిపేట: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో ఆదివారం మండల బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మ ను దగ్ధం చేశారు. ఓట్ల కోసం ఎన్నికల ప్రచారంలో దేశ గౌరవాన్ని కించపరిచే విధంగా, సైనికుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారని, దేశ ప్రజలకు, భారత సైనికులకు ముఖ్యమంత్రి వెంటనే క్షమాపణలు చెప్పాలని మండల బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు హన్మండ్లు, నరేందర్ రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు రాజా గౌడ్, నాయకులు రాజు, విష్ణు, గోపాల్, అనిల్ రెడ్డి సిద్ధిరాములు, తదితరులు పాల్గొన్నారు.


నాగిరెడ్డిపేటలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

ఘనంగా సంత్ నామ్‌దేవ్ మహరాజ్ జయంతి


నివాళ్లు అర్పిస్తున్న మేరు సంఘ నాయకులు

సుభాష్‌నగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సంత్ నామ్‌దేవ్ మహరాజ్ జయంతి వేడుకలు మేరు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో గల మహనీయుల విగ్రహాల ప్రాంగణం లో సంత్ శిరోమణి సద్గురు నామ్‌దేవ్ మహరాజ్ 756వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేరు సంఘం జిల్లా అధ్యక్షుడు సోమ హన్మంత రావు, ఉపాధ్యక్షుడు గంగాకిషన్, నగర అధ్యక్షుడు దశరథ్, ప్రధాన కార్యదర్శి కోట్టూరి దేవిదాస్, చంద్రకాంత్, సుదర్శన్, సంతోష్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ స్థానంలో నిలిచిన బీర్కూర్ లయన్స్ క్లబ్


లయన్స్ అధ్యక్షుడికి వెండి కాయిన్ బహుకరిస్తున్న దృశ్యం

బీర్కూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బోధన డివిజన్ పరిధిలో 12 లయన్స్ క్లబ్‌లు ఉండగా బీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 74 సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు బీర్కూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రమేష్ కు లయన్స్ క్లబ్ హైద్రాబాద్ డిస్ట్రిక్ గవర్నర్ అమర్నాథ్ బాబు ఘనంగా సన్మానించారు. వెండి కాయిన్ బహుకరించారు. నాలుగు నెలల వ్యవధిలో బోధన్ డివిజన్ పరిధిలో ఎక్కువ సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.

ఇంచార్జి ఎస్‌హెచ్‌వోగా మనోహర్‌రావు

నాగిరెడ్డిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మనోహర్ రావుకు ఉన్నతాధికారులు రెండో సారి ఇంచార్జి స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో) గా బాధ్యతలు అప్పగించారు. నాగిరెడ్డిపేట ఎస్సైగా పనిచేసిన మల్లారెడ్డి జూన్ 30న ఉద్యోగ విరమణ చేశారు. అతని స్థానంలో వెంటనే కొత్త ఎస్సైని ఉన్నతాధికారులు నియమించలేదు. ఈ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైలు ఎవరు లేని కారణంగా, కొత్త ఎస్సైని నియమించే వరకు అప్పట్లో పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న మనోహర్ రావ్‌కు ఇంచార్జీ ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన నాలుగు రోజుల పాటు ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం స్థానిక ఎస్సై భార్గవ్ గౌడ్ శుక్రవారం నుంచి మూడు రోజులపాటు సెలవుపై వెళ్లడంతో పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైలు లేని కారణంగా జిల్లా ఉన్నతాధికారులు పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మనోహర్ రావు కు రెండో సారి ఇంచార్జీ ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన శుక్రవారం నుంచి ఇంచార్జి ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వర్తిస్తున్నారు.



గోదావరిలో భక్తుల పుణ్య స్నానాలు

మెండోర, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచంపాడ్ పవిత్ర పుణ్య క్షేత్ర గోదావరి నదిలో కార్తీక మాస పుణ్య స్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామున గోదావరి స్నానాలు చేసి మొక్కులు చెల్లించుకొని, ప్రత్యేక పూజలు చేసి తెప్పలని వదిలారు. అనంతరం భక్తులు గోదావరి నది వద్ద నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రామాలయం, శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక పవిత్ర పుణ్య క్షేత్రం గోదావరి నది భక్తులతో సందడిగా మారింది.


పోచంపాడ్ గోదావరి నది ఒడ్డున పూజలు చేస్తున్న భక్తులు

చురుగ్గా రైల్వే డబ్లింగ్ పనులు


ఫక్రాబాద్ వద్ద రైల్వే డబ్లింగ్ పనులు చేపట్టిన దృశ్యం

నవీపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహంతం నుంచి బాసర వరకు చేపట్టిన రైల్వే డబ్లింగ్ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. గత సంవత్సరం మేడ్చల్ నుంచిమహారాష్ట్రలోని ముద్కెడ్ వరకు రైల్వే డబ్లింగ్ పనులు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా యంచ గోదావరిపై చేపట్టిన రెండవ రైలు బ్రిడ్జి నిర్మాణం పూర్తయింది. ఈ మేరకు రైల్వే డబ్లింగ్ పనులు చివరి దశకు చేరుకోగా వచ్చే సంవత్సరం జనవరిలో పనులను పూర్తి చేసి ట్రయల్ రన్ చేపట్టడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.


ఫకీరాబాద్ రైల్వే స్టేషన్ వద్ద రైల్వే డబ్లింగ్ పనులు చేపట్టిన దృశ్యం

ఆదిలాబాద్ జిల్లాలో జాగృతిబాట

- రెండు రోజుల పాటు సాగనున్న కవిత పర్యటన..

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జాగృతి జనం బాట పేరిట కల్వకుంట్ల కవిత పర్యటన ఆదిలాబాద్ జిల్లాలో రెండు రోజుల పాటు సాగనుంది. బీఆర్ఎస్‌ను విడిచి కవిత జాగృతితో పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత తొలిసారిగా జిల్లాలో పర్యటించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇటీవల బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వేణుగోపాల్ యాదవ్ పార్టీని విడిచి కవిత సమక్షంలో జాగృతిలో చేరడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఇప్పటికే భారత జాగృతి కింద దాదాపు పదేళ్ల నుంచి కవిత మార్గదర్శకత్వంలో పని చేస్తున్న నేతలు, కొత్తగా చేరుతున్న నాయకులతో సమన్వయం కుదురుతుందా అన్న చర్చ కొనసాగుతోంది. ఇక పర్యటనలో తొలిరోజైన సోమవారం ఉదయం మావల వద్ద కల్వకుంట్ల కవితకు శ్రేణులు స్వాగతం పలకనున్నాయి. స్థానిక మార్కెట్ యార్డ్ సందర్శించి రైతులతో ముఖాముఖి జరిపిన అనంతరం చనక కొరట ప్రాజెక్ట్ ను సందర్శించనున్నారు. జైనథ్‌లోని పురాతన శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయాన్ని దర్శించుకున్న అనంతరం.. ఆదిలాబాద్ లోని దివంగత సాహితీవేత్త సామల సదాశివ మాస్టారు నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులతో సమావేశం కానున్నారు. అదేవిధంగా గోండు భాషలో మహా భారతం రాసిన ప్రముఖ సాహితివేత్త తొడసం కైలాష్ నివాసంలో ప్రముఖులతో సమావేశం నిర్వహించనున్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

- సీపీఐ జిల్లా నాయకుడు సాయాగౌడ్

ఇందల్వాయి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసిముద్దయిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలని సీపీఐ జిల్లా నాయకులు సీహెచ్ సాయాగౌడ్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఆదేశాలను పాటించాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సాయాగౌడ్

ఇందూరు యువత కార్యాలయాన్ని సందర్శించిన లయన్స్ ప్రతినిధులు


మాట్లాడుతున్న లయన్స్ ప్రతినిధి

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 2, (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ సంస్కృతి ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న సామాజిక సేవలు అసాధారణమని లయన్స్ క్లబ్ 320 ప్రతినిధులు వ్యాఖ్యానించారు. ఆదివారం ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయాన్ని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ 320 ప్రతినిధులు సందర్శించి ఇందూరు యువత నిర్వహిస్తున్న కార్యక్రమాలు లైన్స్ క్లబ్ ఆఫ్ సంస్కృతి డిస్ట్రిక్ 320 ద్వారా నిరంతర అన్నదానం, గోసేవ అనాథ శవాలకు చేస్తున్న అంత్యక్రియలు , విధి వంచితులకు సపర్యసేవలు వంటి కార్యక్రమాలు నిర్విరామంగా, నిరాఘాటంగా జరిపించడం చాలా గొప్ప విషయం అన్నారు. లైన్స్ క్లబ్ సౌజన్యంతో సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ 320 గవర్నర్ అమర్నాథ్ మాట్లాడుతూ ఇందూరు యువత స్వచ్ఛంద సేవ సంస్థ మరియు లైన్స్ క్లబ్ ఆఫ్ 320డీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలన్నీ ఎంతో సమాజ చైతన్యాన్ని సామాజికసేవలను పంచినాయని ప్రధానంగా సమాజ సేవలో ఈ రెండు సంస్థల సంయుక్త భాగస్వామ్యం కొత్త శకాన్ని లిఖించిందన్నారు. భవిష్యత్తులో ఇందూరు యువతతో కలిసి పని చేయబోయే కార్యక్రమాలన్నింటిలో కూడా సంపూర్ణంగా చేయూత నిస్తామని వారు తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమంలో లయన్ జి.ఆర్ సూర్యరాజ్ మాట్లాడుతూ మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యక్రమాలతో సంయుక్తంగా లయన్స్ క్లబ్ ఆఫ్ సంస్కృతి డిస్ట్రిక్ట్ 320 కలిసి చేయడం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఇందూరు యువత స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ మద్దుకూరి సాయిబాబు, లైన్స్ క్లబ్ 320 ప్రతినిధులు, మర్రి ప్రవీణ్, జ్యోతి, జీఆర్ సుజాత, ఇందూరు యువత కార్యవర్గం ప్రతినిధులు వాల బాలకిషన్, దర్శనం రాజు, చందా జగన్ మోహన్, ఐలేని సంతోష్, సూజాత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

దోమకొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని త్రివేణి పబ్లిక్ స్కూల్‌లో 1997-98లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఆహ్వానించి, శాలువాతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. గత అనుభవాలను, స్మృతులను నెమరువేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. వివిధ ప్రాంతాలలో వివిధ హోదాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా హాజరయ్యారు.

సిద్ధరామేశ్వర ఆలయంలో భక్తుల రద్దీ



ఆలయంలో అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

భిక్కనూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలో దక్షిణకాశీగా బాసిల్లుతున్న సిద్ధరామేశ్వర ఆలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి సైతం భక్తులు ఉదయాన్నే ఆలయానికి చేరుకుని మూలబావి వద్ద స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామిని ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయప్రాంగణంలో కార్తీక దీపాలు, లక్ష వత్తులను వెలగించి మొక్కులు తీర్చుకున్నారు. సెలవు రోజు కావడంతో భక్తులు అధికసంఖ్యలో రాగా ఆలయ పరిసరాలు శివనామస్మరణతో మారుమోగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు, సిబ్బంది జాగ్రత్తలు తీసుకున్నారు.

దాతల సహకారం అభినందనీయం



దాత కుటుంబసభ్యులను సన్మానిస్తున్న సిబ్బంది

మాచారెడ్డి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి అన్నారు. ఆలయ ప్రాంగణంలో రేకులషెడ్డు నిర్మాణానికి రాజన్న సిరిసిల్లకు చెందిన బాష అంబవ్వ- నర్సయ్య దంపతులు రూ.5.51 లక్షలు, హైదరాబాద్‌లోని అల్వాల్‌కు చెందిన ధర్మవరం లక్ష్మీ-శ్రీనివాస్ దంపతులు రూ.5.51లక్షలు, కామారెడ్డికి చెందిన చాట్ల దీక్షిత రూ.14,116, క్యాసంపల్లికి చెందిన నితీష్‌రెడ్డి రూ.5,021లు ఆదివారం అందించారు. ఈ మేరకు కమిటీ సభ్యులు, అర్చకులు దాతలను సన్మానించి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో ప్రభు రాంచంద్రం, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



మాచారెడ్డిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్

మాచారెడ్డి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రైతులంతా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మాచారెడ్డి సింగిల్ విండో చైర్మన్ స్వామిగౌడ్ అన్నారు. ఆదివారం మాచారెడ్డి మండల కేంద్రంతో పాటుగా ఘన్‌పూర్, లచ్చపేట్ గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలన్నారు. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. డైరెక్టర్లు కిషన్‌గౌడ్, బాల్‌రాజు, కాంగ్రెస్ నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీనివాసచారీ, సీఈవో చంద్రారెడ్డి, పాల్గొన్నారు.

5న సామూహిక సత్యనారాయణ వ్రతాలు

సదాశివనగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సదాశివనగర్ మండలంలోని అ డ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలోని శ్రీ వీరభద్రేశ్వర అలయంలో ఈ నెల 5న సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకు లు శివస్వామి ఆదివారం తెలిపారు. ఉదయం 10:30 నుంచి వ్రతాలకు సిద్ధం చేసుకోవాలని, పూజల అనంతరం భక్తులకు శివసదన్‌లో అన్నప్రసాద వితరణ ఉంటుందని చెప్పారు. వ్రతాల్లో పాల్గొనే భక్తులు ఒకరోజు ముందుగానే పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.



ప్రత్యేక అలంకరణలో సత్యనారాయణ స్వామి

కార్తీక దీపదానం

కామారెడ్డిటౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శివకేశవ ప్రీతికరమైన కార్తీకమాసంలో ఆదివారం ముక్కోటి దేవతలకు సమానంగా 33 జ్యోతులను వెలిగించి పూజా కార్యక్రమాలు చేపట్టినట్లు వేదపండితులు గంగవరపు ఆంజనేయ శర్మ తెలిపారు. లక్ష్మీనారాయణ, ఉమామహేశ్వర పూజచేసి దీపదానం నిర్వహించినట్లు తెలిపారు. కార్తీకమాసానికి దీపమే శ్రేష్టమని తెలిపారు. మామిండ్ల అంజయ్య, మారుతిబాబు, మురళి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం

లింగంపేట, నవంబర్ 2(ఆంధ్రజ్యోతి): లింగంపేట మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు ఆదివారం దహనం చే శారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా ఆపరేషన్ సిం దూర్ ను అపహాస్యం చేస్తూ సీఎం మాట్లాడారని బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ సమగ్రతను, సైనికులను కించపరిచేలా మాట్లాడిన సీఎం వెంటనే సైనికులకు, మహిళా మేజర్లకు క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే సీఎం ఇంటిని, క్యాంప్ ఆఫీస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు క్రాంతి కుమార్, దత్తు రాం, రాంచందర్, బాలయ్య, రజనీకాంత్, రవి, అనిల్‌కుమార్, నవీన్ కుమార్, సాయిలు, రాకేష్, అశోక్ ఉన్నారు.

తాడ్వాయి: సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ తాడ్వాయి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆపరేషన్ సింధూర్‌పై అనుచిత వాఖ్యలు చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు పాటిమీది గంగారెడ్డి, మండల అధ్యక్షుడు వెలమ సంతోష్ రెడ్డి, జిల్లా కార్యదర్శి హోటల్ శ్రీను, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంక ట్రావు, మండల నాయకులు స్వామి రెడ్డి, ముదం యాదిరాజు, రవీందర్ రెడ్డి, సురేష్, బాలరాజు, సురేష్ పాల్గొన్నారు.

సదాశివనగర్: జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ఆపరేషన్ సింధూర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని బీజేపీ మండల అధ్యక్షుడు రాంరెడ్డి అన్నారు. ఆదివా రం మండలకేంద్రంలో సీఎం వాఖ్యలకు నిరసనగా ఆయన దిష్టిబొమ్మను పార్టీ నాయకులతో కలిసి దహనం చేశారు. సీఎం వెంటనే జవాన్లకు క్షమాపణ చెప్పాలని, లేదంటే తర్వాత జరగబోయే పరిణామాలకు సీఎం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీజేవైయం నాయకులు ఆదివారం దహనం చేశారు. దిష్టిబొమ్మను దహనం చేస్తున్న క్రమంలో పట్టణ పోలీసులు బీజేవైయం నాయకులను అడ్డుకునే ప్రయత్నంచేయగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని మాత్రం పూర్తిగా దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేవైయం జిల్లా అధ్యక్షుడు నందివేణు మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో ఆపరేషన్ సింధూర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని అన్నారు. గత రెండేళ్ల పాలనలో ఒక్క మంచి పనిచేయకపోవడంతో ప్రజలను ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగాలో తెలియక సైనికులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని మండిపడ్డారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటమి భయంతోనే బీజేపీపై, కేంద్రమం త్రులపై ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నా రు. మరోమారు రాజకీయాల్లోకి సరిహద్దు వివాదాలను, సైనికులను తీసుకురావద్దని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డిలో సీఎం చిత్రపటాన్ని దహనం చేస్తున్న దృశ్యం



సదాశివనగర్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం



లింగంపేటలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు



తాడ్వాయిలో నిరసన తెలుపుతున్న బీజేపీ శ్రేణులు

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

భిక్కనూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని మల్లుపల్లి గ్రామ శివారులో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపి 2 ట్రాక్టర్లలో దోమకొండ మండలం లోని ఉప్పర్‌పల్లికి తరలిస్తుండగా ట్రాక్టర్లను పట్టుకొని కేసునమోదు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు ఆదివారం తెలిపారు. ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న డ్రైవర్లు కుర్మ రమేష్, గద్ద బాబుపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు వివరించారు.

నేడు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అవగాహన

రాజంపేట, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అవగాహన కార్యక్రమం చేపడుతున్నట్లు ఎంపీడీవో బాలకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. మండలానికి 415 ఇళ్లు మంజూరు వగా కేవలం 269 ఇళ్లు మాత్రమే ప్రారంభమయ్యాయని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 3 నుంచి 7 వరకు ఆయా గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటుచేసి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామని చెప్పారు. అన్ని విభాగాల అధికారులు గ్రామసభల్లో పాల్గొనాలన్నారు. ఇళ్లకు సంబంధించిన ఇసుక, ఇటుక, ఐకేపీ ద్వారా లోన్‌లు సమయానికి లబ్ధిదారులకు అందేలా ఆధార్ అప్‌డేషన్‌చేసి ఈకేవైసీ బ్యాంక్ అకౌంట్ డీటెయిల్స్ లబ్ధిదారులవి పొందుపరిచేలా చూడనున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయుల్లో టెట్ కలవరం

(5వ పేజీ తరువాయి)

సర్వీస్ ఉన్నవారు తప్పనిసరిగా రెండేళ్లలో టెట్ అర్హత సాధించాలి.

ఆందోళనలో ఉపాధ్యాయులు

జిల్లాలో మొత్తం 5 వేలకు పైగా జీహెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్‌లు, ఎస్‌జీటీ ఉపాధ్యాయులు ఉన్నారు. ఇందులో టెట్ రాయకుండా వృత్తిలో కొనసాగుతున్న వారే సగానికి పైగా ఉన్నారు. టెట్ అర్హత తప్పనిసరి కావడం, రాయని పక్షంలో స్వచ్ఛంద పదవి విరమణ, నిర్బంధ తొలగింపు టీచర్లను కంటి మీద కునుకులేకుండా చేస్తోంది. ఎస్‌జీటీలు వృత్తి ఇంక్రిమెంట్ రావాలన్నా, స్కూల్ అసిస్టెంట్‌లు ప్రమోషన్‌లు పొందాలన్నా డిపార్ట్‌మెంట్ పరీక్ష ఈవోటీ(ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టెస్ట్) రాస్తారు. ఇప్పటికే 20 ఏళ్లకు పైగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న చాలా మంది టెట్ అర్హత లేదు. దీంతో భవిష్యత్‌లో పదోన్నతులు, బదిలీలు, వేతన ఇంక్రిమెంట్ ప్రభావితమవుతాయన్న భయం వారిని పట్టుకుంది. నియామక సమయంలో టెట్ విధానం లేకపోయిన, ఇప్పుడు మధ్యలో మార్గదర్శకాలు మార్చడం అన్యాయమని వారు వాపోతున్నారు. విద్యాశాఖ మాత్రం కేంద్ర మార్గదర్శకాలను అనుసరించి టెట్ ప్రమాణాలను అమలు చేయక తప్పదని పేర్కొంటుంది.

సంఘాల్లో చర్చలు

2010కి ముందే నియమితులైన వారితో పాటు తర్వాతా పదోన్నతులు పొందిన వారిలోనూ అయోమయం నెలకొంది. ఉపాధ్యాయుల నైపుణ్యాన్ని అంచనా వేయడం అవసరమే అయినా ఇప్పటికే సర్వీసులో ఉన్న వారికి ప్రత్యేక మినహాయింపు లేదా ప్రత్యామ్నాయ విధానం ఉండాలని సంఘాలు కోరుతున్నాయి. తాజా మార్గదర్శకాలపై జిల్లా ఉపాధ్యాయ సంఘాలు చర్చలు ప్రారంభించాయి. కొందరు టెట్ నోటిఫికేషన్ కోసం సిద్ధమవుతుండగా మరికొందరు న్యాయపరమైన మార్గాలపై ఆలోచిస్తున్నారు. ఇటీవల పీఆర్‌టీయూ సర్వసభ్య సమావేశంలోను, ఎస్‌టీయూటీఎస్ రాష్ట్ర నాయకులు ప్రభుత్వం దృష్టికి టెట్‌పై రివ్యూ పిటీషన్ వేసేలా వినతులు అందిస్తామన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి

ఉపాధ్యాయులకు టెట్ అర్హత తప్పనిసరి చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ప్రభుత్వం తగిన విధంగా స్పందించాలి. టెట్ అర్హతకు రెండేళ్ల గడువు ఇవ్వడం, తప్పనిసరిగా పాస్ కావాలని చెప్పడం ఉపాధ్యాయ వర్గాల్లో కలవరం రేపుతోంది. పదోన్నతులు, బదిలీలు, వేతన ఇంక్రిమెంట్ ప్రభావితమవుతాయన్న భయం ఉపాధ్యాయుల్లో నెలకొంటుంది. నియామక సమయంలో టెట్ విధానం లేకపోయిన, ఇప్పుడు మధ్యలో మార్గదర్శకాలు మార్చడం అన్యాయమని తమిళనాడు, కేరళ ప్రభుత్వాలు దావా వేసినట్లుగా తెలంగాణ ప్రభుత్వం సైతం రివ్యూ పిటీషన్‌లు దాఖాలు చేయాలి.

- పంపరి ప్రవీణ్, ఎస్‌టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఉన్నత విద్యకు మళ్లీ బ్రేక్

(5వ పేజీ తరువాయి)

కంటితుడుపు చర్యగా కోట్లలో ఉన్న బకాయిలను లక్షల్లో చెల్లించారు. ఇటీవల రూ.2కోట్ల వరకు మాత్రమే చెల్లింపులు చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు సైతం భిక్షాటన, అర్ధనగ్న ప్రదర్శన, ప్రధాన రహదారులపై ర్యాలీలు, కలెక్టరేట్ వద్ద ధర్నాలు ఇలా పలు దఫాలుగా నిరసనలు వ్యక్తం చేసినా ప్రభుత్వంలో ఎలాంటి మార్పులేకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థుల చదువులపై తీవ్ర ప్రభావం పడుతోంది. ప్రస్తుతం కళాశాలలు బంద్ చేసిన, వేలల్లో ఫీజులను విద్యార్థులకు కట్టే స్థోమత లేకపోతే ఉన్నత విద్య చదువులు అందకుండా పోతాయని విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపాదనలకే పరిమితమైన బడ్జెట్

కామారెడ్డి జిల్లాకు చెందిన ఆయా సంబంధిత శాఖల అధికారులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినప్పటికీ బడ్జెట్ విడుదల కావడం లేదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని మెలికలు పెడుతున్నారు. అలాగే విద్యార్థులకు నెలనెల చెల్లించే స్కాలర్‌షిప్ సొమ్మును కూడా విడుదల చేయడం లేదు. జిల్లాలో ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు, బీఈడీ, డీఎడ్, ఇంజనీరింగ్, ఐటీఐ, నర్సింగ్, బీ ఫార్మసీ తదితర కోర్సులకు సంబంధించి కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలు సైతం ఉన్నాయి. ప్రైవేట్ కళాశాలలో చదివే విద్యార్థులకు నిర్దేశించిన మేరకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తుంది. ప్రభుత్వం ఇచ్చే ఫీజు కంటే ఎక్కువ ఉన్న మొత్తాన్ని విద్యార్థులు చెల్లించాల్సి ఉంటుంది. మెస్‌చార్జీల కింద కోర్సులను బట్టి స్కాలర్‌షిప్ ఇస్తారు. ఈ సొమ్మును నెలనెల కాకుండా ఒకేసారి విద్యార్థుల ఖాతాలో జమ చేస్తారు. ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులకు కేవలం స్కాలర్‌షిప్ డబ్బులను మాత్రమే వారి ఖాతాలో జమ చేస్తారు.



జిల్లా కేంద్రంలో భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు (ఫైల్)

నేటి నుంచి ఉన్నత విద్యాసంస్థల నిరవధిక బంద్

నాలుగేళ్లుగా ప్రభుత్వం స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో విద్యార్థులు, కళాశాల యాజమాన్యాలు ఆందోళన చెందుతున్నారు. సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు రాక ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు బోధన, బోధనేతర సిబ్బందికి వేతనాలు చెల్లించేందుకు తంటాలు పడుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో ఆయా ప్రైవేట్ కళాశాలలు ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే పలుమార్లు కళాశాలలు బంద్ ప్రకటిస్తూ నిరసన చేపడుతున్నారు. అయితే కళాశాలల యాజమాన్యాలపై విజిలెన్స్ తనిఖీలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం బకాయిలు చెల్లించాక తనిఖీలకు సహకరిస్తామని యాజమాన్యాలు అంటున్నాయి. తమ హక్కుగా ఉన్న బకాయిలను అడిగితే విజిలెన్స్ పేరుతో భయభ్రాంతులకు గురి చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేయడం సరికాదని కళాశాలల యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వం చూపుతున్న మీనమేషాలతో మరోమారు నిరవధిక బంద్‌కు సిద్ధం అవుతున్నట్లు కళాశాలల యాజమన్యాలు పేర్కొంటున్నాయి. విద్యార్థులకు అన్యాయం జరుగుతుంటే ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుండడంతో పెద్ద ఎత్తున నిరసనలకు దిగుతామని ఇప్పటికే పలు విద్యార్థి సంఘాలు హెచ్చరికలు జారీ చేయడంతో పాటు నిరసనలు తెలిపాయి.



కలర్ బెల్టులు సాధించిన క్రీడాకారులతో నిర్వాహకులు

తైక్వాండో క్రీడాకారులకు బెల్టుల ప్రదానం

సుభాష్‌నగర్, నవంబరు2, (ఆంధ్రజ్యోతి): అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో కలర్ బెల్టు ప్రమోషన్ టెస్టును జిల్లాకేంద్రంలోని బస్వాగార్డెన్‌లో ఆదివారం నిర్వహించారు. ఇందులో ప్రతిభకనబర్చిన క్రీడాకారులకు కలర్ బెల్టులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అమెచ్యూర్ తైక్వాండో అసోసి యేషన్ చైర్మన్ లక్ష్మీనర్సయ్య హాజరై బెల్టులను క్రీడాకారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. తైక్వాండో నేర్చుకోవడం వల్ల క్రమశిక్షణతో పా టు శారీరకంగా, మానసికంగా ముందుంటారని తెలిపారు. క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని వివరించారు. కోచ్ మనోజ్ పాల్గొన్నారు.

పరువు నష్టం దావా వేస్తాం

సుభాష్‌నగర్, నవంబరు 2, (ఆంధ్రజ్యోతి): ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ సభ్యులపైన పరువునష్టం దావా వేస్తామని మాల మహానాడు, ప్రజా సంఘాల నాయకులు అలుక కిషన్, దండి వెంకట్, బంగారు సాయిలు, దేవిదాస్, ఎల్లయ్య పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్ అండ్‌బీ అతిథిగృహంలో ఆదివారం కానిస్టేబుల్ ప్రమోద్‌కుమార్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళిత ఉద్యోగి త్యాగాన్ని ఓర్వలేకనే అతనిపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అమరుడైన పోలీసు ఉద్యోగి కుటుంబ సభ్యులను కనీసం పరామర్శించకుండా మత సామరస్యం దెబ్బతినేలా చేస్తున్నారన్నారు. ఆరోపణలతో విచారణ పేరుతో చౌకబారు ప్రకటనలను ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ విడుదల చేసిందని ఆరోపించారు. కానిస్టేబుల్ ప్రమోద్ మృతి తర్వాత నిందితుడు రియాజ్‌పై రెండు హత్యాయత్నం కేసులు నమోదు కావడం, అందులో ఒకటి పోలీసు అధికారిపై కత్తితో దాడిచేసి పారిపోవడం, అతడిని పట్టుకోవడానికి ప్రయత్నం చేసిన ఆసిఫ్‌పైన దాడిచేయడం అతని నేరప్రవృత్తికి నిదర్శనమని పేర్కొన్నారు. ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ ఆరోపణలు అవాస్తవమన్నారు.

యువకులకు కౌన్సెలింగ్

సుభాష్‌నగర్, నవంబరు2, (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ నగరంలో శనివారం అర్ధరాత్రి కారణం లేకుండా వాహనాలపై తిరుగుతున్న 40 మంది యువకులకు, వారి తల్లిదండ్రులకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం తాగి వీరంగం సృష్టించిన ఇద్దరిపై కేసు నమోదుచేశారు. అహ్మద్‌పురకాలనీ, ఇస్లాంపుర, కోజా కాలనీ, ఎన్‌ఆర్‌ఐ కాలనీ, అర్సపల్లి, మాలపల్లి ప్రాంతాలలో రోడ్లపై తిరుగుతున్న యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు.

ధ్రువపత్రాలు సమర్పించాలి

సుభాష్‌నగర్, నవంబర్2, (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని క్రీడా అసోసియేషన్‌లు వాటికి సంబ ంధించిన ధ్రువపత్రాలు సమర్పించాలని జిల్లా డీవైఎస్‌వో పవన్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. క్రీడా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు ఈ నెల 6వ తేదీ సాయంత్రంలోపు అసోసియేషన్‌కు సంబంధించిన గుర్తింపు పత్రం, ఎన్నికలు జరిగినప్పటి వివరాలను సమర్పించాలని, వివరాలకు 9701177144 ను సంప్రదించాలని సూచించారు.

పాల్వంచలో గడపగడపకు బీఆర్ఎస్



కార్యకర్తలను పరామర్శిస్తున్న గంప శశాంక్

పాల్వంచ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని బీఆర్ఎస్ యువనేత గంప శశాంక్ అన్నారు. పాల్వంచ మండలకేంద్రంలో ఆదివారం గడపగడపకు బీఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన పాల్గొ ని మాట్లాడారు. కార్యకర్తల కష్టసుఖాల్లో అండగా ఉంటామని, పదేళ్ల పాటు అధికారంలో ఉన్న రోజులను ప్రజలు గుర్తుచేస్తున్నారన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అగమ్యగోచరంగా తయారైందన్నారు. గ్రామానికి చెందిన అంజాగౌడ్, రాములు ఇటీవల మరణించగా, బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజాగౌడ్, నాయకులు విద్యాసాగ ర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, కూచని శేఖర్, తోట నర్సింలు, బాల్‌రాజు, ప్రశాంత్‌రెడ్డి, అనీల్, ఎల్లయ్య, రాంమ్మోహన్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



బైకర్లకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

పర్యావరణ పరిరక్షణకు బెంగూళూరు టు లద్దాక్

భిక్కనూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం బెంగుళూరుకు చెందిన బైక్‌రైడర్లు బెంగుళూరు నుంచి లద్దాక్, భూటాన్ వరకు టూర్ చేపట్టారు. కాగా ఆదివారం భిక్కనూరు మండలం బస్వాపూర్ శివాస్ హోటల్ వద్ద కాసేపు ఆగారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం లీడర్లు జాక్, దిలీప్ మాట్లాడుతూ.. బెంగుళూరు నుంచి 90మంది 30రోజుల పాటుగా హైవేపై రైడింగ్ చేస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. కాగా వీరిని చూసేందుకు స్థానికులు, పోటీపడ్డారు. హైవేపై స్థానికులకు అభివాదం చేస్తూ బైక్ రైడర్లు ముందుకు సాగారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- కె- ర్యాంప్
ప్రియ 35- కాంతార
దర్శన్- బిసన్ కలమందన్

బాన్సువాడ

మహేశ్వరి డ్యూడ్
వెంకటేశ్వర కె- ర్యాంప్

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230